

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 19.0


సెకండియర్ పరీక్షలు ప్రశాంతం

- 15,200 మంది విద్యార్థులకు 14,854 మంది హాజరు

భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 2 : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్ష శనివారం ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 50 పరీక్ష కేంద్రాలలో పరీక్ష నిర్వహించగా జనరల్ విద్యార్థులు 13,763 మందికి 13,508 మంది హాజరయ్యారు. 255 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,437 మందికి 1346 మంది హాజరు కాగా, 91 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 15,200 మందికి గాను 14,854 మంది హాజరయ్యారు. మాస్ కాపీయింగ్ గాని ఇబ్బందులు తలెత్తలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని పరీక్షల కన్వీనర్ చంద్రశేఖర్‌బాబు తెలిపారు.

నేడే పల్స్‌పోలియో

- ఐదేళ్లలోపు 1,85,593 మంది చిన్నారుల గుర్తింపు : డీఎంహెచ్‌వో



భీమవరం, మార్చి 2 : జిల్లావ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ డి.మహేశ్వరరావు తెలిపారు. ఐదేళ్లలోపు 1,85,593 మంది పిల్లలకు వ్యాక్సినేషన్ చేయనున్నట్లు వివరించారు. ఇమ్యునైజేషన్ కార్యక్రమంపై శనివారం తమ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అర్హులైన పిల్లలందరికీ సంపూర్ణంగా పోలియో చుక్కలు అందించేందుకు రెండు లక్షల వ్యాక్సిన్లు సిద్ధంగా ఉన్నా యన్నారు. తొలి రోజు హాజరుకాని వారికి 4, 5వ తేదీల్లో ఇంటింటికి వెళ్లి వ్యాక్సిన్ వేస్తామన్నారు. 2014 తరువాత దేశంలో ఒక్క పోలియో కేసు నమోదు కాలేదన్నారు. జిల్లాలోని 20 మండలాల్లో 34 పీహెచ్‌సీలు, 18 అర్బన్ హెల్త్ సెంటర్లు, ఐదు మునిసిపాలిటీలు, ఒక నగర పంచాయతీలో మొత్తం 1,324 బూత్‌ల వద్ద వైద్య శాఖ సిబ్బంది అధికారులతోపాటు స్వచ్ఛంద సంస్థల సహకారంతో మొత్తం 5,520 మంది వ్యాక్సినేషన్‌లో పాల్గొంటున్నారన్నారు. అవసరం మేరకు జిల్లాలోని ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో చిన్నపిల్లల స్పెషలిస్టులు, ఒక ఎండి, ఒక స్టాఫ్ నర్స్‌ను సిద్ధంగా ఉంచామన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ దేవ సుధ మాట్లాడుతూ వైద్య శాఖ సిబ్బందికి అందరూ సహకరించాలని కోరారు.

ఆ దొంగల పార్టీలోకే వెళ్లారు

- సూర్యప్రకాశ్‌పై గోవిందరావు ఫైర్

భీమవరం, మార్చి 2 : 'వైసీపీ దొంగల పార్టీ. అక్కడ కన్నాలు వేసే వాళ్లే ఉంటారని కామెంట్ చేసిన చేగొండి సూర్యప్రకాశ్ ఇప్పుడు ఆ పార్టీలోకే వెళ్లాడు. అలాంటి వ్యక్తిని ఏమనాలో అతడి విజ్ఞతకే వదిలేస్తున్నాం' అని జనసేన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ జోగయ్య కుమారుడనే గుర్తింపు తప్ప వ్యక్తిగతంగా సూర్యప్రకాశ్‌కి ఏదీ లేదన్నారు. ఆచంట ఇన్‌చార్జిగా, తర్వాత పీఏసీ సభ్యుడి హోదా కల్పించింది పార్టీయే అనే విషయం మర్చిపోకూడదన్నారు. పవన్‌ను, పార్టీని విమర్శించే స్థాయి లేదని, వైసీపీలోకి వెళ్లాలంటే ముందుగా జనసేనను దూషించాలనే నిబంధన వల్లే అక్కడ ఇచ్చిన స్క్రిప్ట్ చదివాడన్నారు. అలాంటి వ్యక్తి పార్టీ నుంచి వెళ్లిపోవడంతో జన సైనికులంతా సంతోషంగా ఉన్నారన్నారు.

ప్రాణం ఉన్నంత వరకూ పవన్ వెంటే ఉంటా : జోగయ్య

పాలకొల్లు, మార్చి 2 : 'నేను బతికున్నంత కాలం జనసేనాని పవన్ కల్యాణ్ వెంటే ఉంటాను. ఆయన రాష్ట్రాధికారంలో భాగస్వామ్యం అయ్యేంత వరకూ పోరాటం ఆగదు' అని కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు, మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఎవరు ఏ విధంగా ప్రవర్తించినా నా పని నేను చేసుకొని వెళతాను. నాకు కావాల్సింది పవన్ రాజకీయ ఎదుగుదల. రాజ్యాధికారం దక్కించుకోవాలనే కాపులు, బడుగు బలహీన వర్గాల ఆశలకు నీరు పోసి పెంచడమే'నని పేర్కొన్నారు. మరోవైపు పవన్ ఎక్కడ నుంచి పోటీ చేస్తే మెరుగ్గా ఉంటుందనే అంశంపై జోగయ్య శనివారం విడుదల చేసిన మరో లేఖలో విశ్లేషించారు. పవన్ పోటీ చేస్తానంటున్న పిఠాపురం, భీమవరం నియోజకవర్గాల్లో లాభనష్టాలను, గత ఎన్నికల నాటి పరిస్థితులు, నేటి పరిస్థితులను వివరించారు. టీడీపీ-జనసేన ఉమ్మడి పోరాటంలో భీమవరం నుంచి గెలుపు అవకాశాలు మెరుగ్గా ఉంటాయని వివరించారు. పిఠాపురంలో కాపు సామాజిక వర్గీయులు అధికంగా ఉన్నప్పటికీ, వైసీపీ అభ్యర్థి కాపు సామాజిక వర్గమేనని గుర్తించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మరోవైపు ముద్రగడ పావులు కదిపే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంటుందని లేఖలో పేర్కొన్నారు.

ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తా : ముద్దరబోయిన

ముసునూరు, మార్చి 2 : 'నూజివీడు నుంచి వెళ్లిపోతానని కొందరు ప్రచారం చేస్తున్నారు. నా ప్రాణం పోయే వరకు ఇక్కడే ఉంటా. వచ్చే ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో దిగుతా' అని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. శనివారం ముసునూరు గ్రామ ప్రజల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పదేళ్లుగా నూజివీడులోనే ఉంటూ, అధికారం ప్రజలకు సేవ చేయడంతోపాటు పార్టీ కార్యక్రమాలను తూచా తప్పకుండా చేశాను. ఎన్నికల్లో గెలుపు ఖాయమనుకున్న సమయంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి ఇక్కడి టిక్కెట్ ఇవ్వడం ఆవేదనకు గురిచేసింది' అని పేర్కొన్నారు.

కమలం కథేంటి!



బీజేపీ అడుగులు ఎటువైపు.. ఒంటరిగానా .. పొత్తు దిశగానా.. ఇదే ప్రశ్న చాన్నాళ్ల నుంచి అందరి నోటా నానుతోంది. ఒకవైపు ఎన్నికల నోటిఫికేషన్ జారీకి కొద్దిరోజులే సమయం ఉండగా కమలం కసరత్తు పెంచింది. అభ్యర్థుల జాబితా రూప కల్పనకు పార్టీ ముఖ్యులతో సమావేశాలు, సుదీర్ఘ మంతనాలు. ఇంకోవైపు సంఘటన్ విభాగ్ బాధ్యుల నుంచి అంతర్గత అభిప్రాయ సేకరణ కొనసాగిస్తోంది.

\- ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి

ఆశావహుల జాబితా తుది పరిశీలన

- అన్ని అర్హతలున్నా ముగ్గురి పేర్లతోనే జాబితా
- వరుసగా పరివార్ సమావేశాలు
- పొత్తుపైనే నేతల నుంచి అభిప్రాయ సేకరణ
- నేడు ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాలపై భేటీ

కమలంలో ఏం జరుగుతోంది ?

ఎన్నికల సందడి ఆరంభమైన దగ్గర నుంచి ఈసారి భారతీయ జనతా పార్టీ ఏం చేయనుందా.. అని అందరిలోనూ ఉత్కంఠ. గత ఎన్నికల మాదిరిగానే ఒంటరిగానా, లేక ఇతర పార్టీలతో పొత్తులకు దిగి మారిన తాజా రాజకీయ పరిణామాలకు అనుగుణంగా అడుగుల వేయబోతోందా ? అనే సందిగ్ధత అందరిలోనూ ఉంది. గతం కంటే తాము బలపడ్డామని, మోదీ ఇమేజ్ ఒకవైపు, రామమందిర నిర్మాణం ఇంకోవైపు పార్టీ పటిష్టతను రెండితలు చేసినట్టు కమలనాథులు అంచనా వేస్తూ వచ్చారు. ఈలోపే భారతీయ జనతా పార్టీ రాజకీయ మిత్రుడు పవన్ కల్యాణ్ ఓ అడుగు ముందుకువేసి తెలుగుదేశంతో ఎన్నికల పీలుగా జత కట్టారు. ఈ పరిణామాలు ఓవైపు సాగుతుండగా భారతీయ జనతా పార్టీ అందరిని టెన్షన్‌లో పెట్టి తన పని తాను చేసుకుపోతోంది. తాజాగా విజయవాడలో రెండురోజుల నుంచి వివిధ జిల్లాల ముఖ్యులతో ముఖాముఖిలు నిర్వహిస్తున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల నుంచి పోటీ చేసేందుకు కొందరు ఆశావహులు ఇప్పటికే పార్టీకి దరఖాస్తు చేసుకున్నారు. వాస్తవానికి ఒక్కో అసెంబ్లీ నియోజక వర్గం నుంచి మూడు నుంచి ఏడు వరకు దరఖాస్తులు అందగా వాటిని పరిశీలిస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎంతమంది దరఖాస్తు చేసుకున్న వాటిలో ముగ్గురి పేర్లు మాత్రమే సూచించాల్సిందిగా పార్టీ ఆదేశించింది. బీజేపీ, జాతీయ సహ సంఘటన్ కార్యదర్శి శివప్రకాశ్ నేతృత్వంలో అభ్యర్థుల స్క్రీనింగ్ కొనసాగుతోంది. ఈ స్క్రీనింగ్ జరిగేటప్పుడు ప్రతీ జిల్లా నుంచి అధ్యక్షుడు, రాష్ట్ర ఆఫీస్ బేరర్‌లు, జిల్లా ఇన్‌చార్జిని భేటీలో ఉండేలా జాగ్రత్త పడుతున్నారు. నేడు ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాల పరిధిలో ఆశావహుల పరిశీలన ముగ్గురితో జాబితా రూపొందించేలా కార్యచరణ సిద్ధం చేశారు. ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో అసెంబ్లీ స్థానాలకు దాదాపు వంద మందిపైగా దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో పార్టీ సూచించిన అర్హతలున్న ముగ్గురిని ఎంపిక చేసి జాబితాలో చేరుస్తారు. తుది నిర్ణయం పార్టీ అధినాయకత్వం నిర్ణయిస్తుంది. నేడు జరుగుతున్న కీలకభేటీకి తపన చౌదరి, భూపతిరాజు శ్రీనివాసవర్మ, విక్రమ్ కిషోర్, తాతాజీ, పాకా సత్యనారాయణ వంటి వారు హాజరవ్వనున్నారు.

మరోవైపు ఇంకో కసరత్తు

ఒకవైపు ఆశావాహుల జాబితాను పరిశీలించి తుది జాబితా రూపకల్పనకు ప్రయత్నిస్తూ ఒకవైపు సంఘటన్ విభాగాలన్ని రాష్ట్ర వ్యాప్తంగా పొత్తుకు దిగాలా వద్దా అనే అంశంపై క్షేత్రస్థాయిలో ఆరాకు దిగాయి. రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది సంఘటన్ విభాగ్‌లు ఉండగా వీటి పరిధిలో ఉన్న ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ, ఏబీవీపీ, మిగతా అనుబంధ కమిటీల్లోని ముఖ్యులను సమావేశపరిచి అభిప్రాయ సేకరణ జరుపుతున్నారు. ఇప్పటికే కొన్నింటిలో పొత్తుకు వ్యతిరేకంగా ఒంటరిగానే బరిలో దిగేలా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్టు సమాచారం. ఈ తరహా అభిప్రాయాలను మరోవైపు పోటీ చేయదలచిన అభ్యర్థి వివరాలను బీజేపీ అధినాయ కత్వానికి నివేదిస్తారు. జాతీయ పార్టీ అయిఉండి పోటీ చేసే ఉత్సాహం ఉన్న అభ్యర్థుల విషయంలో, మరోవైపు పొత్తు విషయంలో ఎటూ తేల్చుకోలేక ఇప్పటికే మిగతా పక్షాల కంటే వెనకబడింది.

ఇవేం రోడ్లు బాబోయ్



7

వన్‌గ్రామ్ గోల్డ్ ధగధగలు



7

మంచు టెండలు



ఈ ఖర్చు దాటిందో.. అనర్హులే

- ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థికి రూ.95 లక్షలు.. ఎమ్మెల్యే అభ్యర్థికి రూ.40 లక్షలు : కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

భీమవరం/క్రైం, మార్చి 2:సార్వత్రిక ఎన్నికలలో సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, ఎస్పీ అజిత వేజెండ్ల పేర్కొన్నారు. భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో శనివారం ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్, వీడియో సర్వే లైన్స్ టీం, వీడియో వ్యూయింగ్ టీమ్, స్టాటిక్ సర్వే లైన్స్ టీం, పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ గాంధీ మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చుల వివరాల నివేదికలను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా సిద్ధం చేయాలన్నారు. ఒక్కో పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి రూ.95 లక్షల వరకు, ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షల వరకు ఖర్చు చేసేందుకు అనుమతి ఉందన్నారు. అంతకుమించి ఖర్చు చేస్తే ఆయా అభ్యర్థులు అర్హత కోల్పోతారన్నారు. అన్ని బృందాలు వారికి అప్పగించిన విధంగా అభ్యర్థుల ఖర్చుల వివరాలను సంబంధిత రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. ఎస్పీ అజిత మాట్లాడుతూ జిల్లా సరిహద్దులో ఐదు చెక్ పోస్టుల ను, 14 సర్వే లైన్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ఎక్కడా డబ్బు, మద్యం, మాదకద్రవ్యాలు అక్రమ రవాణా జరగకుండా చూడాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేటటువంటి వస్తువులను స్వాధీనం చేసుకోవాలన్నారు. ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, ఏఎస్పీ వి.భీమారావు, సెబ్ ఏఎస్పీ ఏటీవీ రవికుమార్, ఆర్డీవోలు కె.శ్రీనివాసులురాజు, ఎం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, డీఎస్పీలు తదితర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్

భీమవరం క్రైం, మార్చి 2 : జిల్లావ్యాప్తంగా మార్చి ఒకటి నుంచి 31వ తేదీ వరకు పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉంటుందని ఎస్పీ అజిత వేజెండ్ల పేర్కొన్నారు. పోలీసులఅనుమతి లేకుండా ఎవరూ సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదన్నారు. నిబంధనలను విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

16న లోక్ అదాలత్..

- కేసుల రాజీపై సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న సివిల్ జడ్జి అప్పలస్వామి

భీమవరం క్రైం, మార్చి 2 : జాతీయ లోక్ అదాలత్ ఈ నెల 16వ తేదీన జరిగే కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు క్రిమినల్ కేసులు, రెవెన్యూ, మున్సిపల్ కేసులపై రాజీకి తీసుకున్న చర్యలపై సమీక్షా సమావేశాన్ని శనివారం పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో సివిల్ జడ్జి బి.అప్పలస్వామి నిర్వహించారు. సమావేశంలో దాదాపు 400 రాజీ చేయడానికి వీలున్న క్రిమినల్ కేసులను గుర్తించినట్లు, వాటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సంబంధిత సబ్ ఇన్‌స్పెక్టర్‌లకు తగిన సూచనలు ఇవ్వాలన్నారు. ఇప్పటికే ఇరుపక్షాల వారికి నోటీసులు ఇచ్చి కౌన్సెలింగ్ ఇస్తున్నట్లు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి తెలిపారు. అలాగే సివిల్ కోర్టులో పెండింగ్‌లో ఉన్న లాండ్ ఎక్విజిషన్ కేసులు, భీమవరం మున్సిపాలిటీకి సంబంధించిన కేసుల రాజీ చేసే దిశగా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని డిప్యూటీ తహసీల్దార్ దుర్గ, మున్సిపల్ ఆఫీస్ మేనేజర్ ఆర్. దేవసేనలకు సూచనలిచ్చారు. ఆకివీడు ప్లానింగ్ అధికారి రాధాకృష్ణ, భీమవరం రూరల్ ఇన్‌స్పెక్టర్ వై.సత్యకిషోర్, ఏజీపీ యు. వరప్రసాద్ పాల్గొన్నారు.

విద్యాదీవెన బకాయిలపై మౌనం



మాటిచ్చి మడమ తిప్పిన జగన్

- కళాశాలల యాజమాన్యాలకు కుచ్చుటోపీ
- నాలుగో సంవత్సరం విద్యార్థుల పరిస్థితి గందరగోళం

(భీమవరం-ఆంధ్రజ్యోతి) :

జగనన్న విద్యా దీవెన సొమ్ముల విడుదలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కారు. విద్యార్థులకు మాత్రం సొమ్ములు జమ కాలేదు. కళాశాలలకు ప్రొసీడింగ్స్ జారీ చేసిన తర్వాత తల్లుల ఖాతాలో జమచేయనున్నారు. అదికూడా విడతల వారీగా విడుదల చేస్తున్నారు. వాస్తవానికి 2023-24 సంవత్సరానికి సంబంధించి తొలి విడత ఫీజు రీఎంబర్స్‌మెంట్‌కు మాత్రమే ముఖ్యమంత్రి బటన్ నొక్కారు. అదే ఇప్పుడు చివరి సంవత్సర విద్యార్థులను ఆందోళనకు గురిచేస్తోంది. ఇంజనీరింగ్, డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఏప్రిల్ నాటికి పరీక్షలు పూర్తి కానున్నాయి. తదుపరి ఫలితాలు విడుదల చేస్తారు. ఉన్నత విద్య చదవాలన్నా, ఉద్యోగాల్లో చేరాలన్నా విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అవసరం కానున్నాయి. ఈ ఏడాది దాదాపు ఎనిమిది వేల మంది విద్యార్థులు డిగ్రీలు పూర్తి చేసుకుని బయటకు వెళతారు. వారందరికీ ప్రభుత్వం దాదాపు రూ. 25 కోట్లు చెల్లించాలి. అప్పుడే విద్యా సంవత్సరం మొత్తానికి ఫీజు రీఎంబర్స్‌మెంట్ చేసినట్టవుతుంది. అంటే నాలుగు విడతల సొమ్మును ఒకేసారి విడుదల చేయాలి. ఏప్రిల్ నెలలో ఎన్నికలు జరగనున్నాయి. అంటే ఇప్పుడే నాలుగు విడుతల సొమ్మును ప్రభుత్వం జమ చేయాలి. కానీ ఒక్క విడతకు మాత్రమే ముఖ్యమంత్రి బటన్ నొక్కారు. జిల్లాలో 33,400 మంది విద్యార్థులకు తొలి త్రైమాసికానికి రూ.25కోట్లు మేర చెల్లిస్తున్నట్టు ప్రకటించారు. కానీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన నాలుగు విడుతల ఫీజుపై స్పష్టత ఇవ్వలేదు. గత ఏడాది పూర్తిస్థాయిలో సొమ్ములు చెల్లించామంటూ ప్రభుత్వం లెక్కకు మిక్కిలి గొప్పలు చెబుతోంది. ఈ ఏడాది మాత్రం ప్రభుత్వం మౌనం పాటించింది.

తల్లుల ఖాతాతోనే ఇబ్బందులు

ప్రభుత్వం ఫీజు రీఎంబర్స్‌మెంట్ సొమ్మును తల్లుల ఖాతాలోనే జమచేయడంతోనే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గత ప్రభుత్వాలు నేరుగా కళాశాలల ఖాతాల్లో జమచేసేవి. యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది పెట్టేవి కాదు. సర్టిఫికెట్లు ఇచ్చేవి. ప్రభుత్వం తదుపరి కాలేజీలకు బకాయిలు చెల్లించేది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితుల్లో మార్పు చోటు చేసుకుంది. కళాశాలల ఖాతాలకు జమ చేయడం లేదు. తల్లుల ఖాతాల్లో ఫీజు రీంబర్స్‌మెంట్ జమచేస్తోంది. వారం రోజుల్లోనే కళాశాలలకు చెల్లించాలంటూ స్పష్టం చేస్తోంది. దీనివల్ల విద్యార్థులకు కలిసి వచ్చేదేమీ లేదు. పైగా బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. అదికూడా ముఖ్యమంత్రి బటన్ నొక్కిన నెల రోజులకు గానీ తల్లుల ఖాతాలో ఫీజురీఎంబర్స్‌మెంట్ జమ కావడం లేదు. కేటగిరీల వారీగా ప్రభుత్వం సొమ్ములు విడుదల చేస్తోంది.

ఒక క్వార్టర్ ఎగ్గొట్టినట్టే

కరోనా సమయంలో ఒక క్వార్టర్ సొమ్మును ప్రభుత్వం విడుదల చేయలేదు. ఇప్పటివరకు విద్యార్థులు ఎదురుచూస్తూ వస్తున్నారు. కళాశాలలు విద్యార్థులనుంచి ముక్కుపిండి వసూలు చేశాయి. జిల్లాలో దాదాపు రూ.25కోట్లు విద్యార్థులు చెల్లించారు. ఆ మొత్తాన్ని ప్రభుత్వం తల్లుల ఖాతాలో జమ చేస్తుందని ఆశించారు. ఇప్పటిదాకా ప్రభుత్వం నుంచి ఉలుకూ పలుకూ లేదు. కరోనా కాలంలో తరగతులు నిర్వహించలేదంటూ ప్రభుత్వం మెలిక పెట్టింది. అంతే తప్పా కళాశాలలను ఏమీ చేయలేకపోయింది. విద్యార్థులనుంచి యాజమాన్యాలు ఫీజులు వసూలు చేస్తుంటే మౌనంగా ఉండిపోవాల్సి వచ్చింది. ఫీజులు చెల్లించకపోతే సర్టిఫికెట్‌లు ఇవ్వలేమంటూ కళాశాలలు తేల్చి చెప్పాయి. అంతిమంగా విద్యార్థులు నష్టపోయారు. బకాయిపడ్డ ఒక క్వార్టర్ ఫీజు రీఎంబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం విడుదల చేస్తుందని విద్యార్థులు ఇప్పటికీ ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచన చేయడంలేదు. ఎన్నికల ఏడాది కావడంతో ఆశలు వదులుకోవాల్సిందే.

పీజీ బకాయిలు ఏవి ?

ప్రభుత్వంపై కళాశాల యాజమాన్యాలు విశ్వసనీయత కోల్పోయాయి. పీజీ విద్యార్థులకు సంబంధించిన బకాయిలను వైసీపీ ప్రభుత్వం చెల్లించలేదు. జిల్లాలో దాదాపు రూ.20కోట్ల బకాయిలున్నాయి. అందులో 75 శాతం అంటే రూ.15కోట్లు విడుదల చేయనున్నట్టు ప్రభుత్వం నమ్మబలకింది. కళాశాలలు సైతం అందుకు అంగీకరించాయి. ఇప్పటివరకు పైసా విడుదల చేయలేదు. త్వరలోనే 2023-24 విద్యా సంవత్సరం తొలి త్రైమాసిక ఫీజును విడుదల చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. వాటితోనైనా బకాయిలు చెల్లిస్తుందని యాజమాన్యాలు ఎదురుచూస్తున్నాయి.

పీజీ కోర్సులకు మొండి చేయి

ఎన్నికల ముందుకు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోయారు. విద్యార్థులు ఎంతవరకు చదవుకున్నా సరే ఉచిత విద్యను అందిస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పారు. మడమ తిప్పారు. పీజీ కోర్సులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లించడం లేదు. పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. విదేశీ విద్యా పథకంపైనా ప్రభుత్వం ఆంక్షలు పెట్టింది. టీడీపీ హయాంలో అమలు చేసిన అంబేద్కర్ విదేశీ విద్యా కానుకను నిలిపివేసింది. ఇటీవల మళ్లీ అమలు చేస్తోంది. అదికూడా ఆంక్షలు విధించడంతో విదేశీ విద్యపై విద్యార్థులనుంచి స్పందన కొరవడింది.

హాల్ టిక్కెట్‌లతో ముడి

మరోవైపు చివరి సంవత్సరం విద్యార్థుల ఫీజు రీఎంబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం స్పందించడం లేదు. ఏడాది మొత్తం ఫీజును చెల్లించాలి. లేదంటే విద్యార్థులపై ఆర్థికభారం పడనుంది. పరీక్షల ముందే ఫీజులపై కళాశాలలు ఒత్తిడి చేయనున్నాయి. లేదంటే హాల్ టిక్కెట్‌లు ఇవ్వలేమంటూ మెలిక పెడుతున్నాయి. ప్రతి ఏడాది ఇదేతంతు జరుగుతోంది. ప్రభుత్వం చేస్తున్న తప్పిదానికి విద్యార్థులు బలవుతున్నారు. ముందుగానే ఫీజు చెల్లించి పరీక్షలు రాసేందుకు అప్పులు చేస్తున్నారు. ఎన్నికల ఏడాది కావడంతో ప్రభుత్వం పెద్దగా పట్టించుకున్నట్టు కానరావడం లేదు. చివరి ఏడాది విద్యార్థుల విషయంలో మౌనం పాటిస్తోంది. అదే జరిగితే విద్యార్థులు ముందుగానే ఫీజులు చెల్లించాలి. తదుపరి ప్రభుత్వం విడుదల చేస్తుంది.



71వ సారి రక్తదానం

నరసాపురం, మార్చి 2: ఆదరణ ట్రస్టు చైర్మన్, సీనియర్ జర్నలిస్టు బొడ్డు కృష్ణ భగవాన్ శనివారం 71వ సారి రక్తదానం చేశారు. రోగికి అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో రెడ్‌క్రాస్ సభ్యులు ఆయన్ను ఆశ్రయించారు. స్పందించిన భగవాన్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు. ఆయన్ను బ్లడ్‌బ్యాంకు నిర్వాహకులు జేసుప్రసాద్, సతీష్, వికాశ్, మహేష్ అభినందించారు.

సర్పంచ్‌ల ఆందోళన ఉద్రిక్తం

- కలెక్టరేట్ వద్ద అడ్డుకున్న పోలీసులు
- మెయిన్ గేటు వద్ద నిరసన

ఏలూరు కలెక్టరేట్, మార్చి 2 : కేంద్ర ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి పశ్చిమ గోదావరి సర్పంచ్‌లు కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. ఆందోళనలో పాల్గొన్న సర్పంచ్‌ల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. స్థానిక సంస్థల నిధులు కాజేసిన సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆ నిధులను పంచాయతీ ఖాతాల్లోకి జమ చేయాలని కోరుతూ ఆందోళనలో భాగంగా ఏపీ పంచాయతీ రాజ్ ఛాంబర్, సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు బారికేడ్లు తొలగించారు. అక్కడే ఉన్న పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. బారికేడ్లు తోసుకుని కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయ త్నించగా పోలీసులు మెయిన్‌గేటును మూసివేయడంతో అక్కడే నిరసన తెలిపారు. పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీవీ రాజేంద్రప్రసాద్ రాష్ట్రంలో స్థానిక సంస్థల నిధులు, విధులు, అధికారాలను జగన్మోహన్‌రెడ్డి దొంగిలించారని మండిపడ్డారు. గ్రామాలు బాగుపడాలన్నా గ్రామీణాభివృద్ధి జరగాలన్నా రాష్ట్రంలోని రూ.3కోట్ల5లక్షల గ్రామీణ ప్రజల స్థితిగతులు మెరుగుపడా లంటే ఎన్నికల్లో సీఎం జగన్‌ను ఓడించాల్సిందేనన్నారు. పంచా యతీ ఛాంబర్ ఉభయ గోదావరి అధ్యక్షుడు కడలి గోపాలరా వు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షు డు పాలడుగుల లక్ష్మణరావు మాట్లాడుతూ పంచాయతీల ఖాతాల్లో ఆర్థిక సంఘం నిధులు జమ చేయాలని కోరితే పోలీసులతో గొంతు నొక్కుతారా అంటూ ప్రశ్నించారు. 14,15 ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశా రు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశా రు. ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీర్రు ప్రతాప్‌రెడ్డి, వై.వినోద్‌రాజు, చుక్కా ధనుంజయ్ యాదవ్, పిల్లి సత్యరాజు, లంకపల్లి మాణిక్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.





కలెక్టరేట్ గేటు ఎదుట సర్పంచ్‌ల ధర్నా (ఇన్‌సెట్‌లో) సర్పంచ్‌లను అడ్డుకుంటున్న పోలీసులు

వైసీపీ నేతల చేతుల్లో పింఛన్ల సొమ్ము

» వలంటీర్లను తప్పించి పంపిణీ





పాలకొల్లు 2వ వార్డు, వెలివెల గ్రామంలో పింఛన్ సొమ్ము అందచేస్తున్న వైసీపీ నాయకులు

పాలకొల్లు, మార్చి 2 : ఇంటింటా పంపిణీ చేయాల్సిన పింఛన్ల ప్రజాధనం వైసీపీ నేతల చేతుల్లోకి చేరింది. మార్చి నెల పింఛన్ సొమ్ములు వారే వీధి వీధి తిరుగుతూ బాహాటంగా లబ్ధిదారులకు అందించి తమ పార్టీకి అనుకూల ప్రచారాన్ని చేపట్టారు. పాలకొల్లులో జరిగిన ఈ ఘటనతో అందరూ అవాక్కయ్యారు. దీని వెనుక మున్సిపల్, మండల పరిషత్, గ్రామ సచివాలయ అధికారులతో పాటు వాలంటీర్ల పాత్ర ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గ పరిధిలో పాలకొల్లు పట్టణం, పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాల్లో నిన్న పలుచోట్ల వైసీపీ కార్యకర్తలే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని బాహాటంగా చేపట్టారు. పట్టణంలోని 1, 2, 6, 10, 17, 23వ వార్డుల్లో అలాగే మండలాల్లోని అయాగ్రామాల్లో వైసీపీ నాయకులే ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్ము అందించారు. ఈపింఛన్ సొమ్ములు పంపిణీ చేసిన కొందరు వైసీపీ నాయకులు, కార్యకర్తలు అయితే బాహాటంగా వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ పింఛన్ సొమ్ము చేతిలో పెట్టిన వైనం కనిపించింది. అసలు ఈప్రభుత్వ ప్రజాధనం ముందుగా వైసీపీ నేతల చేతుల్లోకి ఎలా వెళ్లిందనే ఆశ్చర్యం కలిగిస్తుంది. మరో వైపు కొన్నిచోట్ల వాలంటీర్లు ప్రేక్షకపాత్ర వహిస్తూ వైసీపీ నేతల చేతుల మీదుగా పింఛన్ సొమ్ములు పంపిణీ చేయించిన సంఘటనలు చోటు చేసుకున్నాయి.

మంచుటెండలు

» ఠారెత్తిస్తున్న ఎండలు.. రాత్రి చలి, పొగమంచు





పగలు భానుడి ప్రతాపంతో జిల్లా ప్రజలు విలవిల్లాడుతున్నారు. రాత్రయితే చలి, పొగమంచుతో వింత వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మార్చి ఆరంభంలోనే ఎండలు మండుతుండడంతో రానురాను తీవ్రమవుతాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఏలూరు రూరల్, మార్చి 2: విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం వేళల్లో సూర్యుడి ప్రతాపానికి ప్రజలు ఠారెత్తిపోతున్నారు. రాత్రి అయితే చలి, ఉదయం దట్టమైన పొగమంచు కురుస్తోంది. వారం రోజులుగా వింత వాతావరణంతో వృద్ధులు, చిన్నారులు అనారోగ్యం పాలవుతున్నారు. ముందు తుఫాన్ కారణంగా వర్షాలు, ఉదయం ఎండల తీవ్రత, తెల్లవారు జామున మంచు ప్రభావంతో ఇబ్బందులు పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. శనివారం ఉదయం ఎనిమిది గంటలు దాటినా దట్టమైన పొగమంచుతో రహదారి పై ప్రయాణం చేయాలంటే కత్తిమీద సాముగా మారింది. ఈ ఏడాది వేసవిలో వేడి తీవ్రమై, వడగాల్పులు వీస్తాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. మార్చిలోనే సూర్యుడు భగ్గుమంటున్నాడని, రానున్న రోజులలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

శ్రీవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు



మండపంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, మార్చి 2: చినవెంకన్న ఆలయం శనివారం భక్తులతో కళకళలాడింది. శ్రీవారికి ప్రీతికరమైన రోజు అవడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. భక్తులు మొక్కుబడులను తీర్చుకొని, స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. దీంతో ఆలయం రద్దీగా మారింది.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



మానవహారం నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళలు

పాలకోడేరు, మార్చి 2 : పెరట్లో ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం, ఆదాయం పెంచుకోవచ్చని జోనల్ కో ఆర్డినేటర్ అరుణ అన్నారు. పాలకోడేరు మండల సమాఖ్య కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై ఏపీఎం భారతి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అరుణ మాట్లాడుతూ రైతు సాధికారిత సంస్థ మండల సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించే దిశగా సహకరించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్పీలు వీరేంద్ర, రవి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలకు ఓటు హక్కు వినియోగంపై ఏపీఎం భారతి ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఏలూరు రూరల్, మార్చి 2 : పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక జడ్పీ కార్యాలయంలో శనివారం ఎన్నికల అధికారి కె.ప్రసన్న, ఏపీపీఆర్ ఎంఈవో జిల్లా సంఘం ఆధ్వర్యంలో ఎన్నికల పరిశీలకునిగా గొన్నురి శ్రీధర్ రాజు, అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం పరిషత్ యూనిట్, ఏలూరు (జడ్పీ యూనిట్) కో-ఆప్షన్ ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. ఏవోఎస్ ప్రకాష్, కె.నరసింహమూర్తి, ఎస్.కనకదుర్గా కుమారి, సంఘ సభ్యులు హాజరయ్యారు. నూతన ఆఫీస్ బేరర్‌లను పూలమాలతో అభినందించారు.

కాలుష్య కోరల్లో అన్నయ్యకోడు ఛానల్



పంట కాల్వలోకి వస్తున్న కలుషిత నీరు

కాళ్ళ, మార్చి 2 : సుమారు పది గ్రామాలకు త్రా గునీరు అందించే పంట కాలు వని ఆక్వా చెరువుల యాజమాన్యం కలుషితం చేస్తున్నారని శివారు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కాళ్ళ మండలం జువ్వలపాలెం గ్రామ పరిధిలో అన్నయకోడు పంట కాలువను, రహదారిలోకి అనుకుని ఉన్న చేపల చెరువు నీరు నేరుగా వదిలేయడంతో శివారు గ్రామాల ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాతాళ్ళమెరక, పల్లిపాలెం, కలవపూడి, మోడి, బోస్‌కాలనీ తదితర గ్రామాలకు ఈ పంటకాలువ ద్వారా త్రాగునీరు, సాగునీరు అందుతుంది. అయితే గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా మోటార్ ఇంజన్ సహాయంతో కాలువలోకి వ్యర్ధ జలాలను వదులుతున్నా సంబంధిత అధికారు లు కనీసం పట్టించుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మంచినీటి చెరువులకు నీరు నింపుకునే సమయంలో చేపల చెరువులో నీరు వదిలేయడంతో మంచినీటి చెరువులకు నీళ్ల ఎలా పెట్టుకోవాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రక్కనే మురుగు కాలువ ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా చేపల చెరువులో నీరు వదలడంపై శివారు గ్రామాల ప్రజలు అనారోగ్యం బారిన పడితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. అధికారులు వెంటనే స్పం దించి పంటకాలువలో వదులుతున్న నీటిని నిలుపుదల చేసి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శాశ్వత లోక్‌అదాలత్‌లో సత్వర న్యాయం



ఏలూరు క్రైం, మార్చి 2 : పర్మినెంట్ లోక్ అదాలత్ త్వరితగతిన న్యాయసేవలను పొందవచ్చునని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా శాశ్వత లోక్‌అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ మేరీ గ్రేస్ కుమారి అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ భవనంలో అధికారులతో సదస్సు నిర్వహిం చారు. మానవ జీవితం చాలా చిన్నదని కక్షలు పెంచుకుని జీవించకూడదని, సఖ్యతపడి మంచిగా జీవించాలన్నారు. త్వరితగతిన సమస్యలను పరిష్క రించుకోవడానికి పర్మినెంట్ లోక్‌అదాలత్ ఎంతో సులభమార్గమన్నారు. వాయు మార్గం, జలమార్గం, రోడ్డు మార్గం ద్వారా ప్రయాణీకులను, సరుకులను రవా ణా చేసే సేవల సౌకర్యం, తంతితపాలా, టెలిఫోన్ సేవలు, విద్యుత్ శక్తి, కాంతి, నీరు ప్రజలకు సరఫరా చేసే సంస్థలు, ప్రజారక్షణ, పారిశుధ్యం, వైద్య శాలల చికిత్సాలయాల్లో అందించే ఆరోగ్య సేవలు, జీవిత భీమా సేవలు, బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు, జాతీయ గ్రామీణ ఉపాధి పథకం, విద్య విద్యా సంస్థల సేవలు, గృహాలు, రియల్ ఎస్టేట్ సేవలలో తలెత్తే సమస్యలను ఈ పర్మినెంట్ లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునని ఛైర్‌పర్సన్ మేరీ గ్రేస్ కుమారి సూచించారు.

పోక్సో చట్టంపై అవగాహన తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న మొదటి అదనపు న్యాయాధికారి

ఏలూరు క్రైం, మార్చి 2 : లైంగిక నేరాల నుంచి చిన్నారుల రక్షణకు పోక్సో చట్టాన్ని ప్రవేశపెట్టారని మొదటి అదనపు జిల్లా న్యాయధికారి రామ్‌గోపాల్ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పోలీసు ఉన్నతాధికారులతో పోక్సో చట్టం, బాధితులకు పరిహారం, ఎన్‌డిపిఎస్ చట్టాలపై అవగాహన సదస్సు ఎస్పీ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ అధ్యక్షత వహించారు. మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి రామ్‌గోపాల్ మాట్లాడుతూ పోక్సో చట్టం లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించేందుకని తెలిపారు. 2012 నుంచి ఈ చట్టం అమలులోకి వచ్చిందన్నారు. చట్టాలపై అన్ని శాఖల అధికారులకు ఎప్పటికప్పుడు అవగాహన ఉంటే ప్రజలకు నాణ్యమైన సేవలు అందుతాయన్నారు. ఈ సదస్సులో 8వ అదనపు జిల్లా జడ్జి ఎం సునీల్ కుమార్ కోర్టులలో సమన్లను వారెంట్లను ఎన్‌స్టెప్ ఆన్లైన్ విధానంలో అమలు చేస్తున్నారని రాష్ట్రంలో మొదటిసారిగా ఏలూరులో ఎస్సీ ఎస్టీ కోర్టు, మొబైల్ కోర్టులను ఎన్నుకొన్నారని తెలిపారు. జిల్లాలో 25 పోలీస్ స్టేషన్లలో 25 మంది కానిస్టేబుల్స్‌ను నియమించామని, ప్రతిరోజు ఆన్లైన్ విధానంలో నోటీసులను వారెంట్లను పంపి త్వరితగతిన బాధితులు న్యాయం పొందేలా ఈ పైలెట్ ప్రాజెక్టును రూపొందించారని తెలిపారు. ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ పోక్సో చట్టం బాధితులకు న్యాయం చేయాలన్నారు. శాశ్వత లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ మేరీ గ్రేస్‌కుమారి మాట్లాడుతూ మైనర్ బాలికల కిడ్నాప్‌లు అరికట్టాలన్నారు. మొదటి అదనపు జిల్లా జడ్జి జి రామ్‌గోపాల్, జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, 8వ అదనపు జిల్లా జడ్జి ఎం సునీల్‌కుమార్, శాశ్వత జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎ మేరీ గ్రేస్ కుమారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అడిషనల్ జిల్లా ఎస్పీ స్వరూపరాణి, న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వన్‌గ్రామ్ గోల్డ్ ధగధగలు

మిరుమిట్లు గొలిపే మోడళ్లు...ఆభరణాలకు పెరుగుతున్న డిమాండ్





జంగారెడ్డిగూడెం టౌన్, మార్చి 2 : వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలకు రోజురోజుకు డిమాండ్ పెరగుతోంది. బంగారం ధరలు రోజురోజుకు పెరగడంతో మహిళలు వన్‌గ్రామ్ ఆభరణాలపై ఆశక్తి చూపుతున్నారు. దొంగలు దోచేస్తారనే భయం లేకపోవడం, తక్కువ ధరలో లభించడంతో వీటిపై మక్కువ చూపుతున్నారు. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ఈ ఆభరణాలు దొరుకుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక దుకాణాలలో, ఫ్యాన్సీ స్టోర్లలోనూ విక్రయిస్తున్నారు. ఇవి హైద్రాబాద్, విజయవాడ, తమిళనాడులో తయారవుతాయని విక్రయదారులు అంటున్నారు. బంగారం కొనుగోలు చేయడం ఒకెత్తు అయితే వాటిని భద్రపరచడం మరొకెత్తని పలువురు వాపోతున్నారు. వన్‌గ్రామ్ గోల్డ్‌లోనే అనేక రకాల మోడళ్లు లభిస్తున్నాయి. ఎక్కువకాలం మన్నుతున్నాయని మహిళలు అంటున్నారు.

వన్‌గ్రామ్ గోల్డ్ ధరల వివరాలివి..

వడ్డాణం ధర రూ.500 నుంచి 3వేలు అనేక మోడళ్లు అందుబాటులో ఉన్నాయి. చేతిగాజులు రూ.200 నుంచి వెయ్యి విక్రయిస్తున్నారు. హారాలు, నల్లపూసలు 300 నుంచి రూ.2500 ధర పలుకుతున్నాయి. పాపిడి బిళ్ళలు రూ.100 నుంచి 500 విక్రయిస్తున్నారు.

మంచి డిజైన్లలో వస్తువులు



వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలు ధరించి శుభకార్యాలకు వెళ్లిన ఆందోళన ఉండదు. మంచి డిజైన్‌లలో వస్తువు లు లభిస్తున్నాయి. బంగారాన్ని మించి మెరిసే వన్‌గ్రా మ్ గోల్డ్ ఆభరణాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

- కొప్పుల రాణి, ఉద్యోగి

సీజన్‌లో అమ్మకాలు అధికం..

శుభకార్యాల సీజన్‌లో అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. విజయవాడ, హైద్రాబాద్, ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతుంటాయి. పేద, మధ్య తరగతి కటంబాలే కాకండా ధనిక కుటుంబాలు కూడా ఈ వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. జాగ్రత్తగా వాడుకుంటే మన్నిక ఉంటుంది.

- ఎస్. రమేష్, వ్యాపారి



బైపాస్ రోడ్డు నుంచి బంగారువారి చెర్వుగట్టుకు వెళ్లే మునిసిపల్ రోడ్డు



కె ఇల్లిందలపర్రులో గోతుల మయంగా రహదారి

ఇవేం రోడ్లు బాబోయ్


» గోతులతో రాళ్లుతేలి ప్రమాదకరంగా రహదారులు

» అధికారులు పట్టించుకోవాలని గ్రామస్థుల వినతి

బాగు పడని యాళ్లవానిగర్వు పంచాయతీ రోడ్డు

పాలకొల్లు రూరల్, మార్చి 2 : పాలకొల్లు మునిపాలిటీకి అనుకుని ఉన్న యాళ్లవానిగర్వు పంచాయతీ రోడ్లు అభివృద్ధిలో కుంటుపడ్డాయి. ఐదు సంవత్సరాలుగా కోట్ల రూపాయలు యాళ్లవానిగర్వు పంచాయతీకి ఆదాయం ఉన్నప్పటికీ కనీసం రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టకపోవడం శోచనీయమని ప్రజలు వాపోతున్నారు. బంగారువారి చెర్వుగట్టు నుంచి బ్రాడీపేట బైపాస్ వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. ఈరోడ్డు సగభాగం పాలకొల్లు మున్సిపాలిటీలోనూ మిగిలిన సగ భాగం యాళ్లవానిగర్వు పంచాయతీ పరిధిలో ఉంది. పాలకొల్లు పట్టణ ప్రజలు వేలాది మంది ఈరోడ్డుపైనే ప్రయాణిస్తుంటారు. దీంతో రోడ్డు బాగోక రోజూ ఇబ్బందులు పడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఏరియా ప్రజలు అనేక సార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు. గతంలో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన రోడ్డు దుస్థితి కథనంపై మున్సిపాలిటీ అధికారులు స్పందించి మున్సిపాలిటీ మేర రోడ్డుపై మెటల్ వేసి చేతులు దులుపుకున్నారు. మిగిలిన రోడ్డు యాళ్లవానిగర్వు పంచాయతీ అధికారులు ఎప్పుడు వేస్తారా అని ఏరియా ప్రజలు ఎదురుచూస్తున్నారు.

రెండుసార్లు గాయపడ్డాను



ఈ రోడ్డు పెద్ద గోతులతో అధ్వానంగా ఉంది. రోడ్డుపై వెళ్తూ గోతుల్లో పడి రెండుసార్లు గాయపడ్డానని బంగారువారి చెర్వుగట్టుకు చెందిన కాయల నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రోడ్డు గుంతలు కూడా పూడ్చకుండా అధి కారులు మొద్దునిద్రలో ఉన్నారని ధ్వజమెత్తారు.

కాయల నాగేశ్వరరావు, బంగారువారి చెర్వుగట్టు

రోడ్లు అధ్వానం

ఇరగవరం, మార్చి 2 : మండలంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. గోటేరు నుంచి ఇరగవరం వెళ్ళే 4 కిలోమీటర్ల రహదారి పూర్తిగా ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. కె ఇల్లిందలపర్రు-తూర్పువిప్పర్రు రహదారి గోతుల మయంగా మారి కంకర తేలి అధ్వానంగా ఉంది. అడుగుకో గొయ్యిపడి ప్రయాణం నరకంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంతేరు, కత్తవపాడు, ఇరగవరం, తూర్పువిప్పర్రు, కె ఇల్లిందలపర్రు గ్రామాల ప్రజలు, అధిక సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు ఈ రహదారిపై తణుకు పట్టణానికి ప్రయాణం సాగిస్తారు. కనీసం గుంతలు పూడ్చకపోవడంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలకు గురవుతు న్నామని వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధి కారులు వెంటనే స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



సైకిల్‌పై అయోధ్యకు..



అయోధ్యకు బయలుదేరిన కొల్లాటి రాధాకృష్ణ

మొగల్తూరు, మార్చి 2 : మొగల్తూరు లాకుపల్లవపాలెంకు చెందిన కొల్లాటి రాధాకృష్ణ శనివారం మొగల్తూరు నుండి సైకిల్‌పై శనివారం ఆయోధ్యకు బయలుదేరాడు. ఆయోధ్యలో రామజన్మభూమి స్థలంలో శ్రీరాముడు ఆలయ ప్రారంభం సమయానికి సైకిల్‌పై వెళదామనుకున్నానని అనివార్య కారణాలతో ఆసమయంలో వెళ్ళలేదన్నారు. శ్రీరాముడుపై తనకు భక్తిభావం రాముడును దర్శించాలని తలంచానన్నారు. దీంతో తాను ప్రత్యేకంగా సైకిల్‌పై వెళుతున్నానని తెలిపారు. మొగల్తూరు గాంధీ బొమ్మల సెంటర్‌లో పలువురు రామ భక్తులు ఆయనను కలిసి క్షేమంగా వెళ్ళిరావాలని ఆకాంక్షించారు.

వాటర్ ట్యాంకుకు వైసీపీ రంగులు

ఉంగుటూరు, మార్చి 2 : ఉంగుటూరు మండలం అక్కుపల్లి గోకవరం గ్రామంలో నిర్మిస్తున్న రక్షిత మంచినీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంకుకు వైసీపీ రంగులు వేయడంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికార పార్టీ నాయకుల ప్రచారం తీవ్ర స్థాయికి వెళ్లిందని విమర్శలు వినిపిస్తున్నాయి. తాగునీటిని రాజకీయంగా ఉపయోగించుకుంటారా అని విమర్శిస్తున్నారు.

క్రైం కార్నర్

తల్లి కుమార్తె ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, మార్చి 2 : తరచు అనుమాన పడుతూ పుట్టింటికి పంపించి ఆపై తమ బాగోగులు చూస్తాడో లేదోనని జీవితంపై విరక్తి చెందిన ఓ తల్లి పురుగు మందు తాగి తన రెండున్నర సంవత్సరాల బిడ్డకు పట్టించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. కృష్ణయ్యపాలెంనకు చెందిన అట్రగడ్డ దుర్గా ప్రసాద్‌కు నాలుగేళ్ళ క్రితం ఉంగుటూరులోని ప్రియాంక (24)తో వివాహమయ్యింది. వీరికి రెండున్నర సంవత్సరాల కుమార్తె కారుణ్య ఉంది. ప్రసాద్ హైదరాబాద్‌లో వాచ్‌మెన్‌గా పని చేసేవాడు. తరువాత కృష్ణయ్యపాలెం వచ్చేశారు. భార్యపై అనుమానంతో శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. రెండు నెలల క్రితం ఆమెను పుట్టింటికి పంపిం చేశాడు. ఫోను కూడా చేయకపోవడంతో పెద్దలు కృష్ణయ్యపాలెం వెళ్లి మాట్లాడారు. ఈ నెల 6న ప్రియాంకను కాపురానికి తీసుకువెళ్తానని దుర్గా ప్రసాద్ పెద్దలకు హామీ ఇచ్చాడు. ఇదే విషయం పెద్దలు ప్రియాంకకు నచ్చజెప్పారు. తాను అక్కడకు వెళ్ళినా వేధింపులకు గురి కావాల్సిందేనని తీవ్ర మనస్తాపంతో గుర్రై విష గుళికలను నీటిలో కలుపుకుని శనివారం తాగి కొంత నీటిని తన కుమార్తెకు పట్టించింది. పరిస్థితి తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనపై ఎమ్మెల్సీ నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

చెరువులో పడి యువకుడి మృతి



లింగపాలెం, మార్చి 2: యడవల్లిలో చెరువులో పడి యువకుడు మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన తుమ్మలపల్లి రాజేష్ (28) ఈత కోసం చెరువులో దిగాడు. లోతు ఎక్కువగా ఉండటం వలన యువకుడు మునిగిపోయాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమివ్వడంతో పోలీసుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెన్నారావు తెలిపారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య



లింగపాలెం, మార్చి 2: కలరాయినిగూడెంలో ఉరి వేసుకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. జాలా ఏసు (58) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. మృతుడు గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేశాడన్నారు. శుక్రవారం రాత్రి మద్యం మత్తులో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకొన్నాడు. కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ చెన్నారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీసీసీ గొడౌన్ ఇన్‌చార్జిపై కేసు

కుక్కునూరు, మార్చి 2 : కుక్కునూరు గిరిజన సహకార సంస్థ (జీసీసీ) గొడౌన్ ఇన్‌చార్జి సీహెచ్ వీర్రాజుపై కేసు నమోదు చేసినట్టు కుక్కునూరు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. దాదాపు 30 టన్నుల బియ్యం ప్రక్కదారి పట్టినట్టు సివిల్ సప్లై అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. ఈ క్రమంలో కేసు నమోదు చేశారు.

అత్యాచారం కేసు నమోదు

అత్తిలి, మార్చి 2 : అత్తిలి మండలం ఓ గ్రామానికి చెందిన యువకుడు తన కుమార్తెను బలవంతంగా అత్యాచారం చేశారంటూ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్ళాడని, తన కుమార్తె ఇంటి వద్దే ఉంటోందని తెలిపింది. గత నెల 18వ తేదీ రాత్రి తమ కుమార్తె(14) నిద్రిస్తున్న గదిలోకి చొరబడి అత్యాచారం చేశాడని ఫిర్యాదు చేసింది. తిరిగి 26వ తేదీ రాత్రి కుమార్తె నిద్రిస్తున్న గదిలోకి వచ్చి బెదిరించి అత్యాచారం చేశాడని ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వి.రాంబాబు తెలిపారు.

కారులో బంగారం చోరీ



ద్వారకాతిరుమల, మార్చి 2: శ్రీవారి దేవస్థానం పార్కింగ్ ప్రాంతంలో ఉంచిన భక్తుని కారునుండి ఓ అంగంతకుడు భారీ చోరీకి పాల్పడ్డాడు. అందులో ఉంచిన షుమారు 17 కాసుల 2 గ్రాముల బంగారం అపహ రించారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. వివరాలివి...విశాఖ జిల్లా గాజువాకకు చెందిన కిరీటం సత్యభాస్కరరావు భార్యతో రావులపాలెంలోని బంధువుల ఇంట శుభకార్యానికి హాజరై తిరుగు ప్రయాణంలో ద్వారకా తిరుమలకు వెళ్లారు. కారును దేవస్థానం పార్కింగ్ వద్ద ఉంచి దర్శనానికి వెళ్లి వచ్చేసరికి కారు డేష్ బోర్డులో 17 కాసుల 2 గ్రాముల బంగారు వస్తువులు మాయమైనట్లు గుర్తించి లబోదిబోమన్నారు. లాక్ చేసిన కారులో బంగారం మాయమవడంతో ఆవేదన చెందారు. దీంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలో పోలీసులు సిసి కెమేరాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



ఉంగుటూరు, మార్చి 2 : నారాయణపురం మురుగు కాల్వ వద్ద శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. దీంతో నిడమర్రు మండలం పత్తేపురం గ్రామానికి చెందిన దంపతులు గాయపడ్డారు. భువనపల్లి నుంచి నారాయణపురం వస్తుండగా జరిగిన ఈ ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చూసి విషయం తెలుసుకుని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు పరామర్శించి వారిని తమ వ్యక్తిగత వాహనంలో ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు.

ఈ-క్రాప్ జాబితా సరి చూసుకోవాలి

పోడూరు, మార్చి 2: పంట నమోదు చేయించుకున్న రైతులు ఆర్బీకేల్లో ప్రకటించిన ఈ-క్రాప్ జాబితాను సరిచూసుకొని తప్పొప్పులను ఈనెల 5వ తేదీ లోపుగా వ్యవసాయ అధికారులకు తెలియపర్చాలని మండల వ్యవసాయ శాఖ అధికారి జి.సత్యనారాయణ రైతులకు సూచించారు. ఈమేరకు శనివారం మండలంలోని అన్ని ఆర్బీకే సెంటర్లలోనూ ఈ-క్రాప్ జాబితాలను ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు పేరు, పంట రకం, సాగు విస్తీర్ణం తదితర అంశాలను సరిచూసుకొని వచ్చే దాళ్వా ధాన్యం విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు పడాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ కొప్రపాటి వీరాస్వామి, వ్యవసాయ విస్తరణాధికారులు బి.ప్రసాదు, చాందిని పాల్గొన్నారు.

అందుబాటులోకి మహాప్రస్థానం

నరసాపురం టౌన్, మార్చి 2: ప్రతి పేదవాడికి మహాప్రస్థానం అందుబాటులో ఉంటుందని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం రూ.2.91 కోట్లతో శ్మశానవాటికలో నిర్మించిన నూతన విశ్రాంతి భవనం, అస్థికల భద్రపర్చుగది, వాచ్‌మెన్ రూమ్‌లను ఆయన ప్రారంభించారు. ఇక నుంచి దహన సంస్కారాలు కట్టెలు, బయోగ్యాస్ ద్వారా చేసుకోవచ్చునన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో ఈ మహాప్రస్థానాన్ని నిర్వహించాలని యోచిస్తున్నామన్నారు. చైర్‌పర్సన్ వెంకటరమణ, డాక్టర్ వెంకటేశ్వరావు, కౌన్సిలర్లు వైకెఎస్, షేక్ బుల్లిమస్తాన్, బర్రె జయరాజు, కృష్ణవేణి, ఇందిర, దిలీప్, శ్రీకాంత్, సోమరాజ్ భరత్, మార్కండేయులు పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు ఆర్థిక సాయం

నరసాపురం రూరల్, మార్చి 2: తూర్పుతాళ్ళు గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి తాటికిల్లు దగ్ధమైన విషయం విదితమే. సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని శనివారం టీడీపీ నాయకులు కొవ్వలి నాయుడు, జనసేన నాయకులు చాగంటి చిన్న పరామర్శించారు. తనవంతు సాయంగా చిన్న రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందించారు.

ఐక్య పోరాటాలు చేయాలి

భీమవరం అర్బన్, మార్చి 2: ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం ఐక్యపోరాటాలు చేయాలని సీఐటీయు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జెఎన్‌వీ గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ అన్నారు. శనివారం సీఐటీయు జిల్లా కౌన్సిల్ సమావేశం సీఐటీయు కార్యాలయంలో జరిగింది. మోదీ అధికారంలోకి వచ్చాక కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్‌లు మార్పులు చేశారన్నారు. రానున్న రోజుల్లో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని అన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి: సీఐ



క్రీడాజ్యోతి అందిస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 2: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించా లని పట్టణ సీఐ సుబ్రహ్మ ణ్యం పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో శశి ఇంజనీరింగ్ కళాశాలలో వార్షిక క్రీడా పోటీలను శనివారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో చురుగ్గా పాల్గొనడం వల్ల మానసి కంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. వైస్ చైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, ప్రిన్సిపాల్ మహ్మద్ ఇస్మాయిల్, కో ఆర్డినేటర్ టి. సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

భీమవరం రూరల్, మార్చి 2 : అనాకోడేరు డీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు భీమవరం డీఎన్నార్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో జామెట్రీ బాక్స్, ఎగ్జామ్ ప్యాడ్, రెండు పెన్నులను ప్రతీ ఒక్కరికీ ఉచితంగా అందజేశారు. ప్రిన్సిపాల్ డా.బి యస్ శాంతకుమారి, ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు, పేరెంట్ కమిటీ చైర్మన్ గూడపాటి మిల్టన్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఎస్.అనిలేవ్, ఫిజిక్స్ లెక్చరర్ జి.రంగారావు, రేపాక వెంకన్నబాబు, వి.మెర్సి నిర్మలాకుమారి పాల్గొన్నారు.

ద్వారకా తిరుమలకు వాకర్స్ సభ్యుల పాదయాత్ర

గణపవరం, మార్చి2: వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద నుంచి ద్వారకాతిరుమల పాదయాత్రగా వెళుతున్న గణపవరం వాకర్స్ సంఘం సభ్యులకు పుర ప్రముఖుడు పుప్పాల పుండరీకాక్షుడు కాషాయ జెండా ఊపి ప్రారంభించారు. సభ్యులు సంకు కొండలరావు నాయుడు, స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, తన్నీడి వాసు, గట్టిం రాజు, తోట సత్యనారాయణ, సలాది నాని, తదితరులు పాదయాత్రగా తరలివెళ్ళారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వారపు సంత, కబేళాలకు వేలం పాట

ఆకివీడు, మార్చి 2: పట్టణ పరిధిలో రోజు, వారపు సంతలతో పాటు కబేళాకు శనివారం బహిరంగ వేలం పాటలు నగర పంచాయతీ అధికారులు నిర్వహించారు. రోజువారి సంతకు పుప్పాల గంగాధరరావు రూ.80.8 2లక్షలు, వారపు సంతకు షేక్ అమీర్ రూ.3,25,300, కబేళాకు షేక్ చంటిసాహెబ్ రూ.33వేలకు పాడుకున్నారు. కమీషనర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, ఇతరత్ర ఇబ్బందులు ఏర్పడినా గజిట్ నిబంధనలు ప్రకారం జీఎస్టీతో సహా నగదు చెల్లించాలని, ఎటువంటి రాయితీలు వర్తించవన్నారు.

ఆర్టీసీ లక్కీ డిప్ విజేతలకు బహుమతులు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 2: తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో నుంచి ఆచంట, గణపవరం, భీమవరం, జంగారెడ్డిగూడెం రూట్‌లలో ప్రతి 15 రోజులకు ఒకసారి తీసే లక్కీడిప్‌ను శనివారం డీఎం వై.సత్యనారాయణమూర్తి తీసి విజేతలకు బహుమతులు అందించారు. బహుమతులను తాడేపల్లిగూడెం జీవీ మాల్ సంస్థ అందించినట్లు డీఎం తెలిపారు. జంగారెడ్డిగూడెం రూట్‌లో తాడేపల్లిగూడేనికి చెందిన రాజ్‌కుమార్, సోమేశ్వరరావు ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. అలాగే ఆచంట రూట్‌లో సుబ్రహ్మణ్యం (తాడేపల్లిగూడెం), పి. గోపి (అండలూరు) ప్రథమ, ద్వితీయ బహుమతులు, గణపవరం -భీమవరం రూట్‌లో సీహెచ్ పెద్దబ్బాయి (భీమవరం), పి.చందు (తాడేపల్లిగూడెం) ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నారు.

పౌష్టికాహారం పంపిణీ

పాలకొల్లు టౌన్, మార్చి 2: మానవతా సభ్యుడు బొక్కా రమాకాంత్ తన కుమారుడు శ్రీరామ్ పుట్టినరోజు సందర్భంగా హెచ్ఐవీ బాధిత 30మంది పిల్లలకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేశారు. అర్బన్ ఆరోగ్య కేంద్ర వైద్యురాలు జి.హెన్నా, మానవత అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాసు, కార్యదర్శి పేరిచర్ల ప్రతాప్, సభ్యులు ధనాని సూర్యప్రకాష్, బొక్కా గంగాధర్, విన్నకోట వెంకటరమణ పాల్గొన్నారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

ఆకివీడు, మార్చి 2: ఇంటర్ సెకండియర్ తెలుగు పరీక్ష మొదటి రోజు ప్రశాంతంగా జరిగింది. శనివారం ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేశారు. మండలంలో మూడు సెంటర్లలో 21 మంది గైర్హాజరయ్యారు.

ఆచంట: ఎంవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరానికి సంబంధించి మొత్తం 116 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా వీరిలో శనివారం ఐదుగురు గైర్హాజరైనట్లు పరీక్షల సూపరింటెండెంట్ బి.అప్పారావు, డీవో శ్రీనివాస్ తెలిపారు.

ఉండి: యండగండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని పరీక్షా కేంద్రం చీఫ్ టిఎస్.పెద్దిరాజు తెలిపారు. ఒకేషనల్‌కు 17మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు.

బేడ బుడగ జంగాల కమ్యూనిటీ హాలుకు విరాళం

పెంటపాడు, మార్చి 2: పెంటపాడు మండలం కె. పెంటపాడులో బేడ బుడగ జంగాల కమ్యూనిటీ హాలు నిర్మాణానికి తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గంధం సతీష్ తన సోదరుడు సురేష్ జ్ఞాపకార్థం రూ.లక్ష విరాళంతోపాటు వంద బస్తాల సిమెంటు అందించారు. సర్పంచ్ పీతల సత్యనారాయణ, నాయకులు పంతం శేఖర్, మల్లెల ప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీటి కొరత లేకుండా చూడాలి

గణపవరం, మార్చి2: తాగునీటి కొరత లేకుండా సర్పంచ్‌లు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని గణపవరం ఎంపీడీఓ ఎంఎస్.ప్రభాకరరావు కోరారు. శనివారం ఎస్.కొందేపాడు, కేశవరం, అప్పన్నపేట, జల్లికాకినాడలో మంచినీటి చెరువులను పరిశీలించారు. వంతులవారి విధానంలో కాల్వల నుంచి చెరువులకు నీరు నింపాలని ఆదేశించారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ఆచంట, మార్చి 2: వల్లూరులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. గ్రామంలో వివిధ పనులకు గాను రూ. 30 లక్షలు నిధులు మంజూరు కాగా పనులు చేస్తున్నట్లు ఎంపిపీ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నేలపూడి బేబి, వైస్ ఎంపీపీ తాళం శ్రీనివాస్, ఎంపీటీసీ ఆరుమిల్లి సుబ్బారావు పాల్గొన్నారు.






భీమవరంలో టీడీపీలోకి ఆహ్వానిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షురాలు సీతారామలక్ష్మి.. రేలంగిలో తణుకు టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ పాదయాత్ర.. శివదేవుని చిక్కాలలో ఎమ్మెల్యే నిమ్మల పాదయాత్ర.. బొండాడలో చర్చి నిర్మాణానికి ఎమ్మెల్యే రామరాజు చేతులు మీదగా ఆర్థిక సాయం

నివాస గ్రామాల్లోనే పేదలకు ఇంటి స్థలాలు

ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు హామీ

పాలకొల్లు రూరల్, మార్చి 2: టీడీపీ జనసేన ప్రభుత్వంలో పేదలకు నివాస గ్రామాల్లోనే అన్ని సౌకర్యాలతో ఇళ్ల స్థలాలను పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు తెలిపారు. శనివారం శివదేవుని చిక్కాల, బల్లిపాడు గ్రామాల్లో ఆయన టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో నివాస ప్రాంతాలకు 20 కిలోమీటర్లు దూరంగా నక్కల తిప్ప, కాజగొప్పు గ్రామాల్లో ఉండటానికి యోగ్యం కాని సెంటు భూమిని ఇచ్చి ఇళ్ల స్థలాల పేరుతో మహిళలను, పేదలను దగా, మోసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు సాధనాలు ఉదయభాస్కర్, గన్నబత్తుల గణేష్, కోటిపల్లి సత్యనారాయణస్వామి, వడ్డే సోమచంద్రశేఖర్, జుత్తిగ వెంకటచలం, పంపన శివ, మాచవరపు గణేష్, ఈద రామసత్యనారాయణ, మైపాల నాగలక్ష్మి, కుక్కల సత్యవతి పాల్గొన్నారు.

వివేకా హత్యపై విచారణ ముమ్మరం చేయాలి

భీమవరం అర్బన్, మార్చి 2: ముఖ్యమంత్రి జగన్ సొంత చిన్నాన్న వైఎస్ వివేకానంద హత్యపై జగన్ పాత్ర ఉందన్న అనుమానాలు వివేకా కూతురు డా. సునీత వ్యక్తం చేసిన నేపథ్యంలో విచారణ ముమ్మరం చేయాలని జిల్లా టీడీపీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి డిమాండ్ చేశారు. జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జగన్ తాను అధికారంలోకి రావడం కోసం రాజకీయ లబ్ధితో జగన్ ముఠాతో వైఎస్ వివేకాను హత్య చేశారన్నారు. వివేక కుమార్తె డా.సునీత చేస్తున్న పోరాటానికి టీడీపీ మద్దతు ఉంటుందన్నారు.

టీడీపీలో చేరిక

భీమవరం అర్బన్, మార్చి 2: వైసీపీ అరాచక, విధ్వంస పాలనతో విరక్తి చెందిన వైసీపీ నాయకులు టీడీపీలో చేరుతున్నారని జిల్లా టీడీపీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. వైసీపీ రాజీనామా చేసి టీడీపీలోకి వచ్చే వారందరినీ స్వాగతిస్తామన్నారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో గొల్లవానితిప్ప గ్రామ వైసీపీ నాయకులు నౌండ్రు రాజేంద్ర ప్రసాద్ టీడీపీలో చేరారు. ఆయనకు తోట సీతారామలక్ష్మి టీడీపీ కండువా వేసి ఆహ్వానించారు. టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, మండల పార్టీ నాయకులు రేవు వెంకన్న, కౌరు పృథ్వీశంకర్, పట్టణ అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, నాయకులు బర్రె నెహ్రూ, కొయ్యల గడ్డ గణపతి పాల్గొన్నారు.

శంకుస్థాపనలు.. శిలాఫలకాలతో సరి..



నరసాపురం, మార్చి 2: హడావుడిగా పనులు చేపట్టి నరసాపురం ప్రజల్ని మరోమారు మోసగించేందుకు ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ప్రయత్నిస్తున్నారని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు మండి పడ్డారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ హార్బర్‌కు శంకుస్థాపన చేసి 16 నెలలు గడిచిందన్నారు. ఇప్పటి వరకు పనులు ప్రారంభించకుం డా ఎన్నికల సమయంలో ముదునూరి భూమి పూజ చేయడం ఓట్ల కోసమేనన్నారు. 2022లో ముఖ్యమంత్రి జగన్ శంకుస్థాపన చేసిన రూ.3200 కోట్ల పనుల్లో నేటికి ఒక్కటి కూడా పూర్తికాలేదన్నారు. కొన్ని పనులు పునాదు లు వరకు చేపట్టి ప్రజల్ని మభ్యపెట్టారని పొత్తూరి మండి పడ్డారు. శిలాఫలాకాలు, శంకుస్థాపనలతో ముదునూరి ప్రజల్ని మభ్యపెట్టారే తప్ప చేసింది శూన్యమన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కొప్పాడ రవి, జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, షెక్ హుస్సేన్, పద్మ వాతాడి ఉమా పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలన: ఆరిమిల్లి

ఇరగవరం, మార్చి 2 : దేశంలోనే అరాచక పాలనగా వైసీపీకి పేరు పడిందని టీడీపీ-జనసేన ఉమ్మడి తణుకు ఎమ్మెల్యే అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సకల జనుల చైతన్య యాత్రలో భాగంగా మండలంలోని రేలంగి, కేతావారిపాలెం, కావలిపురం గ్రామాలలో శనివారం ఆయన పాదయాత్ర చేశారు. దారిపొడవునా టీడీపీ, జనసేన శ్రేణులు ఆయనను పూలమాలలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. పలువురు గ్రామస్థులు ఆయనకు గ్రామ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి మాట్లాడుతూ రేలంగిలో జగన్ కాలనీకి సరైన రహదారి లేకపోవడం దారుణమన్నారు. అలాగే గ్రామాల్లో డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావలిపురం గ్రామంలో ఆయన రాత్రి బస చేశారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడు చుక్కా సాయిబాబు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి బొంతు శ్రీను, తెలుగు యువత అధ్యక్షుడు గూడూరి నాగరాజు, రేలంగి గ్రామ అధ్యక్షుడు మానే భాస్కరరావు, కామన ఏడు కొండలు, కావలిపురం సర్పంచ్ అప్పన్నస్వామి పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

కాళ్ళ, మార్చి 2 : చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే మంతెన రామరాజు, జనసేన ఉండి ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు అన్నారు. కాళ్ళ మండలంలోని 21 గ్రామాల్లో టీడీపీ జనసేన నాయకులతో పరిచయ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. బొండాడ గ్రామంలోని పెదపేటలో నూతనంగా నిర్మిస్తున్న చర్చికి టీడీపీ గ్రామాధ్యక్షుడు మందపాటి కృష్ణమూర్తి తన తాత జ్ఞాపకార్థం ఇచ్చిన రూ.1,00,000 విరాళంను ఎమ్మెల్యే రామరాజు చేతుల మీదుగా సంఘ పెద్దలకు అందించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండలాధ్యక్షులు జీవీ నాగేశ్వరరావు, ఎరుబండి రామాంజనేయులు, నాయకులు గేదల జాన్, తోట ఫణిబాబు, గవర లక్ష్మీ, అడ్డాల శివరామరాజు, ఆరేటి దిలీప్ పాల్గొన్నారు.

సీఎం శవ రాజకీయాలు మానాలి



తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 2: తన తండ్రి మరణానికి కారకులైన వారిని శిక్షించి న్యాయం చేయాలని కూతురు పోరాడుతుంటే తమ్ముడిని సీబీఐ అరెస్టు చేయకుండా సీఎం జగన్ అడ్డుపడుతున్నాడని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి విమర్శించారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసులో జాప్యానికి సీఎం జగనే కారణమంటూ సునీతే చెప్పారన్నారు. సీఎం జగన్ ఇప్పటికైనా శవరాజకీయాలు చేయడం మానుకోవాలని సీఎంగా కొనసాగే అర్హత జగన్‌కు లేదన్నారు.



మేమంతా పవన్ వెంటే..

ఆచంట/పెనుగొండ, మార్చి 2: హరిరామ జోగయ్య కుమారుడు సూర్య ప్రకాష్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీలో సముచిత స్థానం కల్పించారని అయితే సూర్య ప్రకాష్ జనసేనపార్టీకి రాజీనామా చేసి వైసీపీలో చేరారని జనసేన పార్టీ నాయకులు విమర్శించారు. శనివారం పెనుగొండలో జనసేనపార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పలువురు జనసైనికులు మాట్లాడుతూ సూర్య ప్రకాష్ జనసేన పార్టీ ఇన్‌చార్జిగా ఉన్నప్పటికి పార్టీ అభివృద్ధికి గాని, కార్యకర్తలను కూడా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. తాము పవన్ బాటలోనే నడుస్తావని, టీడీపీ జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పితాని సత్యనారాయణను భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. సమావేశంలో జనసేన పార్టీ నాయకులు కొండవీటి శ్రీనివాసు, యర్రగొప్పుల నాగరాజు, జవ్వాది బాలాజీ, కొయ్యే వెంకట కార్తీక్, గుర్రాల సూరిబాబు, మండేల శ్రీనివాస్, అడ్డగర్ల నరసింహరావు, నిమ్మన శేఖర్, నంబూరి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ దస్తావేజుల పంపిణీ

ఆచంట, మార్చి 2: జగనన్న కాలనీల రిజిస్ట్రేషన్‌ల దస్తావేజులను శనివారం శ్రీ రామేశ్వరస్వామి సత్రంలో పంపిణీ చేశారు. ఆచంట మండలానికి సంబంధించి 863 దస్తావేజులను ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచ్‌లు కోట సరోజిని, గణేషుల శేషవాణి, దిరిశాల విజయలక్ష్మి, సుంకర సీతారాం, జక్కంశెట్టి చంటి, బోడపాటి వెర్రియ్య పాల్గొన్నారు.

భీమవరం రూరల్: లూథరన్ పాఠశాల ప్రాంగణంలో శనివారం విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన హయాంలో వందల ఎకరాల భూమిని సేకరించి ప్రజల కోసం వాటిని వినియోగించానన్నారు.

అన్నసమారాధన

నరసాపురం రూరల్, మార్చి 2: వేములదీవి గ్రామంలోని వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు విచ్చేసి స్వామివారి ప్రసాదాలు స్వీకరించారు. అంతకు ముందు ప్రత్యేక అలంకరణలో ఉన్న వెంకన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం సుబ్బారావుపేటలోని శ్రీనివాస రామాలయం పునఃనిర్మించి రెండేళ్లయిన సందర్భంగా శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ నిర్వాహకులు కొప్పిశెట్టి చంటి పర్యవేక్షించారు.

నూకాలమ్మ ఆలయానికి వెండి బహూకరణ



భీమవరం టౌన్, మార్చి 2 : పట్టణంలోని 33 వ వార్డు సిరియాల వారి వీధిలో నూకాలమ్మ అమ్మవారికి వెండి చీర తయారు చేయుటకు రాయలం గ్రామానికి చెందిన మీసాల శ్రీనివాసు, వరలక్ష్మి దంపతులు వెండిని బహూకరించారు. ఉదయం ఆలయ కమిటీకి 250 గ్రాములు వెండి అందించినారు. ఆలయ కార్యదర్శి రౌతు హరిబాబు, కోశాధికారి తాళ్ళపూడి పరవేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ పథకాలపై అవగాహన

ఇరగవరం, మార్చి 2: సైబర్ నేరగాళ్ళతో ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని ఇరగవరం ఎస్‌బీఐ మేనేజర్ రవి తెలిపారు. శనివారం ఇరగవరంలో ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు రాజమహేంద్రవరానికి చెందిన కళాజాత ద్వారా వీధి నాటికతో ఎస్‌బీఐ పథకాలపై అవగాహన కల్పించారు.

6 నుంచి వడలిలో పితాని పాదయాత్ర

పెనుగొండ, మార్చి 2: ఆచంట టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి పితాని సత్యనారాయణ పాదయాత్ర ఈ నెల 6 నుంచి వడలి గ్రామంలో ప్రారంభమవుతుందని, పాద యాత్రను విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు ఉప్పలపాటి చంటి అన్నారు. వడలిలో శనివారం పార్టీ కార్యకర్తలు, శ్రేణులతో సమావేశం నిర్వహించారు.

బెంగాల్‌లో మహిళలకు రక్షణ కరువు



ప్రకాశంచౌక్‌లో ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

భీమవరం టౌన్,మార్చి 2 : పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోతున్నదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ అన్నారు. పశ్చిమబెంగాల్లో మహిళలపై జరుగుతు న్న అకృత్యాలపై స్పందించని మమతా బెనర్జీ ప్రభుత్వం వైఖరికి నిరసనగా శనివారం సాయంత్రం ప్రకాశం చౌక్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ పాక సత్యనారాయణ, పార్లమెంట్ కన్వీనర్ల పేరిచర్ల సుభాష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కోమటి రవికుమార్, అల్లూరి సాయి దుర్గ రాజు, సీనియర్ నాయకులు రాఘవులు, ఉన్నమట్ల కబర్ధి, మహిళా మోర్చా అధ్యక్షుడు అల్లూరి పద్మ వర్మ పాల్గొన్నారు.

నేడు పల్స్ పోలియో

వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు అవగాహన ర్యాలీలు

ఆకివీడు, మార్చి 2:తల్లిదండ్రులు తమ ఐదేళ్ళ లోపు పిల్లలకు ఆదివారం రెండు పల్స్ పోలియో చుక్కలు వేయించి జీవితాలు బాగుచేసుకోవాలని యూపీహెచ్‌సీ వైద్యుడు వెంకటపతిరాజు అన్నారు. శనివారం స్థానిక యూపీహెచ్‌సీ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్ళి పల్స్ పోలీయోపై అవగాహన కల్పించారు.



నరసాపురం టౌన్: పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మునిసిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈర్యాలీలో వైద్య సిబ్బందితో పాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. 5ఏళ్ల లోపు పిల్లలందరికీ చుక్కల మందు వేయాలని, దీని వల్ల ఎటువంటి అనర్థాలు ఉండవంటూ నినాదాలు చేశారు. చైర్‌పర్సన్ వెంకటరమణ, కమిషనర్ వెంకటేశ్వరావు, నోడల్ అధికారి డాక్టర్ స్వరూప్, డాక్టర్ సోనియా, మోహన్, సత్యభూషన్‌లు పాల్గొన్నారు.

పాలకోడేరు: పల్స్ పోలియో కార్యక్రమాన్ని నూరుశాతం విజయవంతం చెయ్యాలని పాలకోడేరు పీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ రంగం నాయుడు అన్నారు. పల్స్ పోలియోపై అవగాహనా ర్యాలీని శనివారం నిర్వహించారు. డాక్టర్ రంగంనాయుడు మాట్లాడుతూ ఆయా గ్రామాలలోని పల్స్ పోలియో బూత్‌లు వద్ద ఆదివారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ర్యాలీలో డాక్టర్ స్వర్ణ నిరంజని, డా.లీలా లక్ష్మీ, సీహెచ్‌వో సత్యనారాయణ, పీహెచ్‌వో కుమారి, డ్వాక్రా ఏపీఎం భారతి పాల్గొన్నారు.

తణుకు: అర్హులైన చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయాలని నోడల్ అధికారి డాక్టర్ బి.దుర్గామహేశ్వరరావు అన్నారు. శనివారం తణుకులోని జిల్లా కేంద్ర ఆసుపత్రిలో పోలియో చుక్కల పంపిణీపై జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో 52 పోలియో కేంద్రాలు, 3 మొబైల్ టీంలను, రైల్వే స్టేషన్, బస్టాండ్‌ల వద్ద ఏర్పాటు చేశామని, ఆదివారం పోలియో కేంద్రాలు వద్ద, 4, 5 తేదీల్లో ఇళ్లకు వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియోను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వివిధ పీహెచ్‌సీల వైద్యులు డాక్టర్ పృధ్విరాజ్, డాక్టర్ నాగభూషణం, డాక్టర్ డేనియల్ రాజు, సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆకివీడులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


పోడూరులో ర్యాలీ.. కాళ్ళ, అత్తిలిలో మానవహారం నిర్వహిస్తున్న డ్వాక్రా, అధికారులు

ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

పోడూరు, మార్చి 2: బలమైన ప్రజాస్వామ్యం కోసం ఓటర్లు చైతన్యవంతులు కావాలని పోడూరు మండల ఐకేపి ఏపీఎం ఎస్.వి. ఆచార్యులు కోరారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం పోడూరులో ఐకేపీ సిబ్బంది, డ్వాక్రా మహిళలకు క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో అయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడే విధంగా ఓటు హక్కు వినియోగం ఉండాలన్నారు. ముందుగా ఓటర్లను చైతన్యం పరుస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహిం చారు.

కాళ్ళ: కాళ్ళ గ్రామంలో శనివారం మండల మహిళా సమాఖ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రకృతి వ్యవసాయం, ఓటర్లు, విద్య, ఎన్నికలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ఆదివారం జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని చెప్పారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని సూచనలు చేశారు. అనంతరం కాళ్ళ సంత మార్కెట్ వద్ద ఓటర్లు విద్య ఎన్నికల భాగస్వామ్యంపై అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏపీఎం కే శ్రీనివాసరావు, సీసీలు మోహన్, పద్మజ, సుమలత, మండల సమాఖ్య అధ్యక్షురాలు మహాలక్ష్మీ, కోశాధికారి సుజాత, గ్రామ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

అత్తిలి: సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరగడానికి అర్హతగల ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాలని ఏపీఎంవో రత్నకుమార్ కోరారు. శనివారం అత్తిలి మండల మహిళా సమాఖ్య భవనంలో ఓటు హక్కుపై మహిళా సంఘ సభ్యులకు అవగాహన సదస్సు కల్పించారు. ఆదివారం జరిగే పల్స్‌పోలియోను ప్రతి గ్రామ సంఘ పరిధిలో ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించేలా చూడాలన్నారు. మహిళా సంఘ సభ్యులు అత్తిలి సెంటర్‌లో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సమీపంలో మానవహారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ ఏపీఎఫ్ బాలకోటయ్య, సీసీలు సునీత, మూర్తి, మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.